# 8. శాప కవిత్వం

ఆ మధ్య ఒకరు ఇంటర్వ్యూ చేస్తూ "మీ అభిమాన రచయిత ఎవరండీ ?" అని ప్రశ్నించగా... "ఇంకెవ్వరు ? నేనే !" అనబోయి, అది మరీ పాతబడిన జోక్ అని గుర్తుకొచ్చి మరి ఆలోచించకుండా "వేములవాడ భీమకవి" అనేశాను.

"ఎవరు ? భీమకవా ? ఘటోత్కచ పరిణయం అనే నవలరాసినాయనేనా ? అతనా, మీ అభిమాన రచయిత ?" అని అతను తెల్ల మొహం పెట్టేడు.

"కాదు నాయనా ! భీమ పురాణం రాసాడా మహానుభావుడు. చచ్చి ఏ వరకాన ఉన్నాడోగానీ, మహాకవి అనుకో" అన్నాను.

అంతట అతగాడు నా నెత్తిన దేనికోసమో కాస్సేపు వెతికి "సార్, మీ నెత్తిన కనీసం గోష్పాదమంత పిలక కూడా లేదే. పైగా షైట్ పాంట్ వగైరాల్తో మీరు అచ్చుమ్రాడన్ కవికుమారుల్లా ఉన్నారే ! మరిమీకా పాతకాలపు పిలక కవిగారెలా అభిమాన రచయిత అయినట్టూ ?" అని ప్రశ్నించేడు.

నేనా భీమకవి కవిత్వం అంతగా చదవలేదు గానీ,

చిన్నప్పుడు క్లాసు పుస్తకాల్లో భీమకవి కవితా మహాత్మ్యాల్ని గురించిన కథలు మాత్రం చాలా చదివేను, ఆ మహానుభావుడు ఎక్కడ ఏ అన్యాయం ఎదురయినా ఠకీమని ఓ ఆశు పద్యం చదవటం, అదో శాపంగా మారి రాజులు తరాజులవటం, పండితులు పడకవేయటం జరుగుతూండేది.

కవిత అనేది చాలా శక్తివంతమయినదనీ, దేన్నైనా మార్చగల, బద్ధకాన్నీ, మలబద్ధకాన్నీ వదలగొట్టగల పరమౌషధమనీ నాకప్పుడు అనిపించేది. కనుక నేనూ ఓ కవి నవాలనీ, జామకాయలు ఫ్రీగా కోసుకోనివ్వని మా ప్రక్కింటి సుబ్బిశెట్టిగాడినీ, వాడి జిడ్డు మొహం పెళ్ళాన్నీ కాలో చెయ్యో విరిగేలా శపించి పారేయాలనీ తహతహలాడి పోయేవాణ్ణి.

నా కవితా గొంతెమ్మ కోరికలేవీ నెరవేరలేదుగానీ, ఆ తర్వాత చాలా కవిత్వం మాత్రం చదివేను, "రవిగాంచని చో కవిగాంచునుగదా?" అని మరో మహా కవి ఎవరో సెలవివ్వగా "ఆహా! కవులెంత అదృష్టవంతులు" అని ఆనందించేనేగాని "ఏమిటి కనుపించేది? రాజుగారి తొడమీది తామరా? రాణీవారి కాలికింది పుట్టుమచ్చా? అని కుంటి ప్రశ్నలు మాత్రం వేసుకోలేదు.

సరే! హైస్కూల్లో చేరాక విదేశమానస పుత్రులనబడే వాళ్ళ కమ్యూనిస్టు కవిత్వం చదువుతూన్నపుడు నాకు మళ్ళీ భీమకవి గుర్తుకొచ్చేడు. ఆ భీమకవిగారి శాపకవి

త్వంలో కొండంత గాకున్నా కనీసం కొండలో సగమంత స్వార్థం కలిసిఉండేది. కాని, కమ్యూనిస్టు భీమకవులు స్వార్థ ప్రయోజనాలకు గాక పరార్థ ప్రయోజనాలకు శాపాలు పెట్టేవారు. ఆహా! వీళ్ళెంత గొప్పవాళ్ళు! నేనెప్పుడు కామ్రేడ్ కవిత్వం రాయగలనో గదా! అనిపించేది.

రోజూ నాకు పొలం నుండి తినటానికని పండో, ఫలమో తెచ్చిచ్చి నా దగ్గర పాఠాలు చెప్పించుకునే మా పాలేరు కొడుకు కూడా నాలాగే మంచిబట్టలేసుకుని, కడుపు నిండా తిని నాతోపాటే హైస్కూలుకొచ్చి చదువుకోగలిగేలా ఈ సమాజాన్ని నా కవితా శాపాల్తో మార్చిపారేయాలనిపించేది.

కానీ, అదృష్టవశాత్తూ నేను చెడిపోలేదు. ఏలినవారు నా మెరిట్‌కు మెచ్చి స్కాలర్‌షిప్ ఇచ్చి యూనివర్సిటీలో చదూకోమనగానే అక్కడి లెక్చరర్ల కవితా లెక్చర్లతో నా భావాలే మారిపోయాయి. కవిత్వం అతి పవిత్రమైన దనీ దానిని తుచ్ఛమైన అల్పవిషయాల కుపయోగించరాదనీ మా లెక్చరర్ పండితులు బల్లగుద్ది, పిలక దులిపి నా బుర్రకెక్కించి నన్నుబుద్ధిమంతుణ్ణి చేశారు.

ఔను. మరి! ముక్కుతిమ్మన్న గారేం చేశారు? రాయలవారికీ, వారి దేవేరికీ గొడవొచ్చి డైవోర్సుదాకా పోతే "పారిజాతాపహరణం" రాసి రాజీ కుదిర్చేరు. శ్రీనాథుడేం చేశాడు! మహారాజులవారి ఉంపుడుకత్తె పిర్రమీది పుట్టు

మచ్చపై పంచరత్నాలు రాసి దీనారటంకాల తీర్థమాడాడు తన కవితతో సహా! అదిగదా కవితా ప్రయోజనం! దైవోప హతులైన సవాలక్ష దగాపడిన తమ్ముళ్ళను గురించి ఎన్ని కవిత లేడ్చి ఏలాభం! కవితా సరస్వతిని కుష్టురోగుల ప్రక్కన బజార్లో నిలబడ మనటం వల్ల అగ్రహారాలొస్తాయా? రాయల వారి మెళ్ళోని మణిహారాలొస్తాయా?

కష్టా లంటారా! అవి లేని దెక్కడ?

మన అదృష్టం కొద్దీ తెలుగు దేశాన పుట్టిన మహాకవి శ్రీనాధుడు. ఆయనగారి కవితలూ చాటువులూ చదివి ఈనాటికీ లొట్టలు వేసేవారూ, చొంగలూ కార్చుకునేవారూ అసంఖ్యాకంగా ఉన్నారు. అంతటి మహాకవి పాలకుల అక్రమాలకు గురై శిక్షపడి "నగర వాకిట నుండు నల్లగుండు" మోయలేక చచ్చినా ఏలిన వారిని శపిస్తూ కవితలు రాసి జనాన్ని రెచ్చగొట్టకపోగా, దర్జాగా 'దివిజ కవివరుల గుండియల్ దిగ్గు రనగ. అరుగుచున్నాడు శ్రీనాధు డమర పురికి" అంటూ మహోన్నతంగా పాడి మరీ వేంచేశాడు గదా.

పరాయి ఊళ్ళో పంచరత్నాలకు చద్దన్నం పెట్టేవాడు దొరక్కపోతే శ్రీనాధులవారు సవినయంగా 'తల్లీ కన్నడ రాజ్యలక్ష్మి, దయలేదా నేను శ్రీనాధుడన్" అని ఏడుస్తూ అప్పీలు చేసుకున్నాడే గాని శాపాలు పెట్టాడా? చేతులకు బేడీలు పడి, వీపుకు ఇనపగుండు ఎక్కితే 'బిలబిలాక్షులు తిని

పోయె తిలలు. పెసలు, ఎటుల చెల్లింతు నేనూరు టంకాల శిస్తు' అని ఏడ్చాడేగాని శిస్తడిగిన అక్రమాన్ని శపిస్తూ కవిత అల్ల లేదే!

మహా కవులుగా మన కవితా చరిత్రలో మిగిలిపోయిన వాళ్ళంతా కవితామ తల్లి పవిత్రతను, ఔన్నత్యాన్ని భద్రంగా తాటాకు దడుల్తో కాపాడారేగానీ, సరస్వతీదేవిని చౌకడిపోల ముందు అలగా జనం మధ్య క్యూలో నించోమని ఈనాటి కవుల్లా నిర్దాక్షిణ్యంగా తోసెయ్య లేదే!

చివరికి "రాజుల్మత్తులు వారి సేవ నరక ప్రాయంబు' అనే అపూర్వ రహస్యాన్ని కనిపెట్టేసిన ఆనాటి విప్లవ కవులు కూడా "వాణి నా రాణి!" అని చెప్పుకున్నారేగానీ "వాణి మనందరి రాణి' అని కవిత అల్లారా?

అందుకే ఈ మధ్య కొందరు కవుల్ని జైల్లో పెడితే సంతోషించాను, ఘనమైన పలినవారు మెలకువగానే ఉన్నారు గదా! కవితా పవిత్రతని కవి దుర్మార్గుల బారినుండి రక్షిస్తున్నారు గదా? అని. వీళ్ళకు వర్గపోరాటం, విప్లవం అంటూ కవిత్వం రాసి కవితామతల్లి కి అపచారం చేయటం తప్పమరేం చేతకాదు. వీళ్ళీనాటి భీమకవులే.

బాగానే ఉంది, పలినవారిని అభినందించాల్సిందే, కానీ— కానీ— ఈరోజు ఓ పేపర్లో చదివాను. 'ప్రజలు చైతన్య వంతులై తమ హక్కుల్ని సాధించుకోవాలి. శుష్క

నినాదాలు నిష్ప్రయోజనకరం" అని సాటూత్తూ ముఖ్య మంత్రిగారే కరీంనగర్‌లో ఉపన్యసించారు. అదే గొప్పసభలో మన రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షులవారు "వర్గ పోరాటానికి సిద్ధపడందే ఆర్థిక సమత రాదు" అని శలవిచ్చారు. ఇది చదివి నేను చాలా చాలా చింతించేను. ఇదేమిటీ? ఏలినవారు కూడా భీమకవుల్లా మాట్లాడేస్తున్నారూ? వారు కూడా వర్గపోరాట మనీ కార్యాచరణ అనీ కవిత్వం చెపితే ఇంతమంది మాడర్న్ భీమకవుల గతేం కాను. వాళ్ళిహ ఏం రాసుకోవాలి. ఎవర్ని తిట్టాలి ?

(సెప్టెంబర్ 1971)